భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో జరుగుతున్న వివిధ రహదారులకు సంబంధించి భూ సేకరణ, భూ సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్, చిత్తూరు ఆర్డీఓ రేణుకాతో కలిసి వివిధ మండలాలకు సంబంధించిన తహసీల్దార్‌లతో సమావేశం జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్ హైవే, చిత్తూరు - తచ్చూరు రహదారి, నాయుడుపేట రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారంకు సంబంధించి పెండింగ్ పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ గురించి రివ్యూ నిర్వహించారు.

ప్రజలకు దూరమవుతున్న రెవెన్యూ సేవలు

- నెల రోజులే ఉంటానంటూ పనులు చేయని
- యాదమరి తహశీల్దార్ నిర్వాకం
- అధికారి తీరుపై ప్రజల ఆగ్రహం

కార్యాలయం ముందు ఇద్దరు వీఆర్‌ఏలు తహశీల్దార్ గది ఎదుట క్యూ లైన్ లో రైతులు

ప్రజాశక్తి -యాదమరి

యాదమరి తహశీల్దార్ నిర్వాకంతో ప్రజలకు అందాల్సిన రెవెన్యూ సేవలు దూరమవుతున్నాయి. ఇటీవల తహశీల్దార్ బదిలీల్లో భాగంగా యాదమరి తహశీల్దార్‌గా హనుమంతు బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుండి మండల నలుమూల నుండి ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ మండల తహశీల్దార్‌ను కలవాలంటే ప్రజలైన, రైతులైనా, ప్రజాప్రతినిధులైనా, పోలీసులైనా, విలేకరులైనా, ఎవరైతే నేమి ముందుగా కార్యాలయం ముందున్న ఇద్దరి వీఆర్‌ఏల అనుమతి తీసుకోవాలి. వారు వెళ్లి తహశీల్దార్‌కు చెబితే ఆయన అనుమతిస్తే లోనికి రమ్మంటేనే వెళ్లాలి.. లేకుంటే గంటల తరబడి తహశీల్దార్ పిలుపు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. తీరా తమ సమస్య తహశీల్దార్‌కు చెప్పుకుందామని వెళ్తే... సమస్య అంతా విని నెలరోజుల తర్వాత చేసుకోండి అని ఉచిత సలహా మాత్రమే ఇస్తారు.. విద్యార్థుల సర్టిఫికెట్లు తప్ప.. మరి ఇతర రెవెన్యూ సమస్యలు ఆయన దష్టికి తీసుకెళ్తే నా పరిధిలో లేదు.. అనే సమాధానమే ఎదురవుతుంది. ఆయన వచ్చినప్పటి నుంచి తహశీల్దార్ కార్యాలయంలోని వీఆర్వోలు, విలేజర్ సర్వేయర్స్, ఆఫీస్ సిబ్బంది ఆయన ఆదేశాలను పాటించడం లేదు. ఎవరి దారి యమునా తీరే అన్న చందంగా కార్యాలయ పాలన కొనసాగుతుంది. మ్యుటేషన్స్, అడంగల్ కరెక్షన్స్, వన్ బి కరెక్షన్స్, అసైన్మెంట్‌కు దరఖాస్తులు ఇవేవీ తీసుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పోజింగ్ సర్టిఫికెట్స్, గ్రామ కంఠాల ధ్రువీకరణ పత్రాలు, మరి ఇతర సేవలకు దరఖాస్తులు తీసుకెళ్లిన ఇవి నేను ఇచ్చేది లేదు. ఏం అడిగినా సరే.. నా పరిధిలో లేదు అనే సమాధానమే ఎదురవుతుంది. అసైన్మెంట్ కమిటీలో మొదటి విడత తప్పిపోయిన దరఖాస్తులు ఏవైనా ఉంటే దరఖాస్తు చేసుకోసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపిన యాదమరిలో మాత్రం దరఖాస్తులు తీసుకోవడం లేదు.

మా భూమికి పట్టా ఇప్పించండి

- అన్నామలై , రైతు, అత్తిగారిపల్లి గ్రామం

నా పేరు అన్నామలై.. మాది అత్తిగారిపల్లి గ్రామం. నాకు ఒకటిన్నర ఎకరా పొలం ఉన్నది సర్వేనెంబర్ 636లో గుడితిరెడ్డిపల్లి రెవెన్యూలో ఊటి నరకరా భూమి సాగు చేసుకుంటున్నాం. ఈ భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు కావాలని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ గత ఆరు నెలలుగా తిరుగుతున్నాం. వీఆర్వో గానీ, తహశీల్దార్ గానీ ఎవరు ఏం పట్టించుకోవడం లేదు. అసైన్మెంట్ కమిటీలో పేరు నమోదు చేయాలంటే కమిటీని లేదు. పేరు ఎలా నమోదు చేస్తాం పోవయ్యా అని చెబుతున్నారు. మా గ్రామంలో నేనొకరే కాదు ఇలాగే పది మంది వరకు రైతులు పట్టాల కోసం ఎదురుచూస్తున్నాం.

ధ్రువీకరణ పత్రం కోసం మూడు నెలలుగా..

- పి మమత, దాసరపల్లి

నా పేరు మమత, మాది దాసరపల్లి గ్రామం. దసరాపల్లి గ్రామకంఠంలో పక్కా ఇల్లు నిర్మించుకుని ఉన్నాం. రిజిస్ట్రేషన్ కోసం తహశీల్దార్ దగ్గర ధ్రువీకరణ పత్రం కావాలని గత మూడు నెలలుగా తిరుగుతున్నా తహశీల్దార్ నా పరిధిలో లేదు ఎంపీడీవో ఆఫీస్‌కి వెళ్ళండి అని చెబుతున్నాడు. అక్కడికి వెళ్ళితే మేము ధ్రువీకరణ పత్రం ఇవ్వము, తహశీల్దారు ఇవ్వాలి మీరు అక్కడికే వెళ్ళండి అని గత మూడు నెలలుగా రెండు కార్యాలయాలకు తిరుగుతున్న ఇప్పటివరకు ధ్రువీకరణ పత్రం ఇప్పటికీ ఇవ్వలేదు.

నా భూమి వేరే వాళ్లు పట్టా తీసుకున్నారు

- ఏకాంబర రెడ్డి , రైతు, వేపనపల్లి గ్రామం

నా పేరు ఏకాంబర రెడ్డి, నాకు వేపనపల్లి గ్రామంలో నడింపల్లి రెవెన్యూలో సర్వేనెంబర్ 239లో 067 సెంట్లు భూమి ఉంది. గత 40 సంవత్సరాలుగా మేము వ్యవసాయం సాగు చేసుకుంటున్నాము. మా భూమిని వేరే వాళ్ళు పట్టా తీసుకున్నారు. దీనిపై తహశీల్దార్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దొంగ పట్టాను రద్దుచేసి మాకు పట్టా ఇవ్వాలని కోరుతూ అసైన్మెంట్ కమిటీలో పేరు నమోదు చేసి పట్టా ఇప్పించాలని గత మూడు నెలలుగా తిరుగుతున్న ఇప్పటివరకు మా పొలం వద్దకు ఏ అధికారులు రాలేదు పట్టించుకోలేదు.

మండలంలో అధిక సంఖ్యలో భూ సమస్యలతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన రైతులకి దరి చేరడం లేదు. యాదమరి తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సేవలు అందించటంలో ఇటు రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్స్ తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ రైతులు కార్యాలయాలు వెంట తిప్పుకుంటూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి రైతుల ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని యాదమరి ప్రజలు, రైతులు పలువురు కోరుతున్నారు.

తహశీల్దారు తీరు బాధాకరం

ఉన్నతాధికారులు స్పందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

యాదమరి మండల తహశీల్దార్ వ్యవహరిస్తున్న తీరుతో మండల ప్రజానీకం అనేక రకాల ఇబ్బందులు పడుతుంటే కలెక్టరేట్‌కి కూతవేటు దూరంలో ఉన్న తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఎన్ని రోజులున్నా ఉనన్న రోజులు సక్రమమైన బాధ్యతలు చేయాలని, అలా కాకుండా బాధ్యతారహితంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులు, రైతులు ప్రజలకి అందుబాటులో ఉండాల్సిన తహశీల్దార్ ఎవరిని అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని ఇది సరైనపద్ధతి కాదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగుచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఉప ముఖ్యమంత్రి

ప్రజాశక్తి- చిత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న ఇల్లులేని వారందరికీ గహ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో నిర్మిస్తున్న గహ నిర్మాణాలపై రివ్యూ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ నియోజకవర్గానికి ఎక్కువ సంఖ్యలో గహాలు మంజూరు కావడం జరిగిందని, అదేవిధంగా నిర్మాణాలు కూడా చేసుకోవడం జరుగుతోందని అయితే కొంతమంది ఇంటి స్థలాలు గహ నిర్మాణాలుకు అనుమతి కావాలని కోరడం జరుగుతోందని అన్నారు. క్షేత్రస్థాయిలో కాలనీల వారీగా ఇంకా ఖాళీగా ఉన్న స్థలాలతోపాటు మరిన్ని మంజూరులు కావాలని, ఇంటి పట్టాలు గహ నిర్మాణాలు అవసరమైన వారిని గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ గహనిర్మాణాలలో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో భారీగా జరుగుతున్నాయని అదే స్థాయిలో పూర్తి చేయడం కూడా జరిగిందని అయితే ప్రభుత్వ ఆశయం మేరకు అర్హత ఉన్న వారికి ఇల్లులు ఇవ్వడం జరుగుతుందని ఇంకా మంజూరు కాని వారిని గుర్తించడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా అన్ని మండలాలలోనూ ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు గహనిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని ఇల్లు మంజూరు ఇవ్వడం జరుగుతుందని ఇందులో భాగంగా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. భూసేకరణ గురించి తహసీల్దారులకు ఆదేశాలు జారీ చేయడం జరుగుతుందని ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, హౌసింగ్ అధికారులు వెంకటేశ్వర్లు శంకరప్పల, పలువురు పాల్గొన్నారు.

ఈవిఎంలు వచ్చాయి

ఈనెల 5 నుంచి ఈవిఎంల అక్సెప్టేన్సీ, 14 నుండి పరిశీలన : కలెక్టర్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాకు ఐదు వేల ఈవీఎంలు రావడం జరిగిందని, అక్టోబర్ 5 నుండి సంబంధిత ఇంజినీర్ల ముందు ఈవిఎంల యాక్సెప్టెన్సీ, 14వ తేది నుంచి ఈవీఎంల పరిశీలన జరుగుతుందని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి అన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదుకు పలువురు దరఖాస్తులు చేసుకోవడం జరుగుతుందని అయితే చిరునామాలు సక్రమంగా ఉండడం లేదని పరిశీలన చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు ఐదువేల ఈవీఎంలు రావడం జరిగిందని, ఇంజనీర్ల సమక్షంలో గురువారం అక్సెప్టెన్సి నుంచి పరీక్ష నిర్వహిస్తారని, అనంతరం ఈనెల 14 నుంచి ఈవీఎంల పరిశీలన కార్యక్రమం పార్టీ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మరో వారంలో రెవెన్యూ అధికారులకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అవగాహన కోసం వర్క్ షాప్ నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఓటరు నమోదు, తీసివేతకు సంబంధించి బల్క్‌గా దరఖాస్తులను సమర్పించరాదని అన్నారు. డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రత్యేక పోలింగ్ కేంద్రం నిమిత్తం ఎటువంటి దరఖాస్తులు అందలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ తరపున గోపి, బిజెపి నుంచి అట్లూరి శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి నుంచి మహేంద్ర, ఎన్నికల డిటిలు తదితరులు హాజరయ్యారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలి

పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, తులసి రెడ్డి డిమాండ్ చేశారు. హోదా సాధనకై చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు బుధవారం ఉదయం ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రుద్రరాజు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటున్నారని అన్నారు. రెండు ప్రాంతీయ పార్టీలను చూసి విసిగి వేసారి జాతీయపార్టీని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సోనియా గాంధీ ఆదేశాల మేరకు ఎన్నికల్లో నిలిచే అవకాశం ఉందని తెలిపారు. వైయస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని అయితే సోనియా గాంధీ ఆదేశాల మేరకు ఆమె ఆంధ్రాలో, లేదా తెలంగాణలో ఎక్కడ నుంచైనా పోటీ చేయవచ్చు అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోకి వలసల పర్వం మొదలైందన్నారు. రఘువీరా రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా హామీ, పునర్విభజన చట్టంలోని అంశాల సాధనే కాంగ్రెస్ ప్రధాన అజెండా అన్నారు. రెండు పార్టీలు శక్తికి మించి అప్పులు చేశాయని, రాష్ట్రం అప్పుల ఊబీలో కూరుకుపోయిందని అన్నారు. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ పార్టీ ఒకటే ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇంచార్జ్ మేయ్యప్పన్, మాజీ ఎంపీ చింతామణి మోహన్, టిక్కి రాయల్, బుల్లెట్ రవి, పరదేశీ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

నాడు-నేడు నిధులు ఖర్చు చేయని

141 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నాడు- నేడులో భాగంగా పాఠశాలలలో నిధులు ఉండి గత 15 రోజులు ఖర్చు చేయని 141 మంది పాఠశాలల హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సమగ్రశిక్ష ఏపిసి ని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాడు- నేడు పురోగతిపై జిల్లా కలెక్టర్ సమగ్ర శిక్ష ఏపిసి వెంకట్రమణా రెడ్డితో కలసి అన్ని మండలాల ఎంపిడిఓలు, ఎంఈఓలు, సంబంధింత ఇంజనీరింగ్ శాఖల ఈఈ లు, డీఈలు, ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు- నేడు కార్యక్రమంనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని, ఇంతటి ముఖ్యమైన కార్యక్రమానికి ఎంపిడిఓలు, ఎంఈఓలు సంబంధింత ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. నాడు- నేడులో భాగంగా పాఠశాలలలో నిధులు ఉండి ఖర్చు చేయని పాఠశాలల హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, విధులలో అలసత్వంను సహించేది లేదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. పనులు చేస్తున్నప్పటికీ కొన్ని పాఠశాలలు బిల్లులు అప్ లోడ్ చేయడంలో జాప్యం జరగడం పై ఎంఈఓలను ప్రశ్నిస్తూ వారి సమాధానాలకు కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని, బిల్లుల అప్ లోడింగ్‌లో ఎక్కువ పెండెన్సీ ఉన్న పాఠశాలల హెచ్ఎంలు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో అప్ లోడింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నాడు నేడు కింద పనులు జరుగుతున్న పాఠశాలల్లో నిధుల కొరత ఉన్న పాఠశాలలకు మిగులు నిధులు ఉన్న పాఠశాలల నుండి సర్దుబాటు చేసి పనులను వేగవంతంగా చేసేందుకు ఎంఈఓలు ప్రత్యేకశ్రద్ధ పెట్టి పనిచేయాలని తెలిపారు. దీనితో పాటు సిమెంట్ కూడా మిగులు ఉన్న పాఠశాలల నుండి అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేయడం జరుగుతుందని, ఈ విషయంలో పనులు జరుగుతున్న అన్ని పాఠశాలల హెచ్ఎంలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా పాఠశాలలను తనిఖీచేసి సంబంధిత యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వాలంటీర్ల సర్వే అయిన తరువాత జిల్లాకు అందిన వివరాల మేరకు బడి ఈడు పిల్లలందరి వివరాలను పక్కాగా నమోదు చేయాలని, తప్పొప్పులకు తావివ్వరాదన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 11 లోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిఈఆర్ (గ్రాస్‌ఎంరోల్మెంట్ రేషియా) లక్ష్యంను పూర్తిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్ రెడ్డి, ఆర్ డబ్ల్యూ ఎస్ఈ శ్రీనివాసులు, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, జిఈఆర్ కో-ఆర్డినేటర్ అజయ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేద్దాం : మేయర్

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సభ్యులంతా కలిసికట్టుగా పనిచేసి చిత్తూరు నగరాన్ని అభివద్ధి చేసుకుందామని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మేయర్ ఎస్.అముద అధ్యక్షతన జరిగింది. ఎక్స్ అఫిషియో సభ్యుల హోదాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరపాలక సంస్థ అభివద్ధికి సభ్యులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో అభివద్ధి పనులు ఊపందుకున్నాయని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మిగిలిన అభివద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా మంజూరు చేసిన నిధులకు సంబంధించిన పనులను చేపట్టాలన్నారు. ఇదే సమయంలో అత్యధిక ప్రాధాన్యత ఉన్న కట్టమంచి బైపాస్ రోడ్డు, చవటపల్లి రోడ్డు, కొంగారెడ్డిపల్లిలో మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి సత్రం చర్యలు ప్రారంభించాలన్నారు. నగర కమిషనర్ అరుణ మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డుల్లో చెపట్టిన పనులకు సంబంధించిన వివరాలను సభ్యులకు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో భాగంగా అజెండా అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. నగరపాలక సంస్థ పరిధిలో కట్టమంచి వై జంక్షన్ నుండి సాంబయ్య కండిగ పుత్తూరు రోడ్డు వరకు రోడ్డును అభివద్ధి చేయుటకు రూ.3.95కోట్లు కేటాయించడం, సంతపేట దుర్గమ్మ గుడి నుండి చౌటపల్లి మీదుగా జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వరకు రోడ్డు అభివద్ధి కోసం రూ.1.79కోట్లు కేటాయించడం, కొంగారెడ్డిపల్లి మెయిన్ రోడ్డులో మేజర్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.85లక్షలు కేటాయించడానికి ఆమోదించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర పాలక అధికారులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మండల స్థాయిలోనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా ప్రతి శుక్రవారం ఒక మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు ఖచ్చితంగా పాల్గొన్నాలని, ఈకార్యక్రమ నిర్వహణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు మొదలు ప్రత్యేక అధికారులు, మండల, గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు వరకు సంబంధిత మండలంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగస్వాములు కావడం ద్వారా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలిపారు. అక్టోబర్ నెలలో 6వ తేదీ శుక్రవారం పూతలపట్టు నియోజకవర్గం యాదమరి మండల కేంద్రంలో, 13వ తేదీన పుంగనూరు నియోజకవర్గం సదుం మండల కేంద్రంలో, 20న కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండల కేంద్రంలో, 27న పలమనేరు నియోజకవర్గం గంగవరం మండల కేంద్రంలో జరుగనున్నాయని తెలిపారు. **యాదమరి:** ఈనెల 6వ తేదీ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ శివరాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమ నిర్వహణలో భాగంగా 6న స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

సిసిఎల్‌ఏ కార్యదర్శి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రీసర్వే పనులు వేగవంతం చేయడానికి సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఏ స్థాయిలోనూ పెండింగ్ లేకుండా చూడాలని సిసిఎల్‌ఏ కమిషనర్ సిద్ధార్థ జైన్ అన్నారు. బుధవారం విజయవాడ నుండి రీసర్వే పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్‌ను సిసిఎల్‌ఏ కమిషనర్ నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రీసర్వే పనులలో రెండు దశలు పూర్తి అయ్యాయనీ మూడవ దశకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పారదర్శకంగా పనులు జరిగేందుకు సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఏ స్థాయిలోనూ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో మొదటిదశలో 132, రెండవదశలో 91 గ్రామాలకు సంభందించి పనులు పూర్తిఅయ్యాయని, మూడవదశలో పనులు106 గ్రామాలలో వివిధ దశలలో పనులు జరుగుతున్నాయని క్షేత్రస్థాయి పర్యటనలతో పాటు రోజువారీ పనులను పర్యవేక్షిస్తూ వేగవంతంగా పనులు చేస్తున్నారని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు వివరించారు.

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బిజెపి దేశంలో అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే పనిగా పెట్టుకుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు విమర్శించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్లో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. దేశంలో ముస్లిం, క్రిస్టియన్స్, దళితులపై జరుగుతున్న దాడులకు బిజెపి మతోన్మాద విధానాలే కారణమని తెలిపారు. అంబేద్కర్ దేశ ప్రజలందరికీ సమాన హక్కులు ఉండేలా రాజ్యాంగాన్ని కాలరాస్తూ ప్రజాస్వామ్యంపై, మానవ హక్కుల మీద దాడి చేస్తున్నారని తెలిపారు. దళితుల హక్కుల రక్షణ కోసం డిసెంబరు 4వ తేదీన దేశంలోని అన్ని దళిత సంఘాలను కలుపుకొని చలో ఢిల్లీ కార్యక్రమాన్ని బిజెపి మతవన్మాదనికి వ్యతిరేకంగా చేపడుతున్నామనీ, దీన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్ పార్టీ కూడా బిజెపి విధానాలకి అంటకాగడం శోచనీయమనీ, ప్రతిపక్ష టీడీపీ కూడా అదే బాటలో నడవడం పేదలకు మరింత నష్టాలు చేకూరుస్తాయని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, రమణయ్య, బాలకష్ణ, గురవమ్మ రాజగోపాల్, ముత్యాలయ్య, నారాయణ మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

'బండారు' అరెస్ట్ కరెక్టే: సీపీఐ నారాయణ



ప్రజాశక్తి- నగరి: మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండారు సత్యనారాయణను అరెస్టు చేయడం తప్పేమీకాదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. విమర్శలు, ప్రతి విమర్శలు చేసేటప్పుడు విమర్శ చేసేవారిని రాజకీయ ప్రత్యర్థులు గానే చూడాలి తప్ప వ్యక్తిగత ప్రత్యర్థులుగా చూడకూడదని సూచించారు. రాజకీయంగా ఎదుర్కోవాలే తప్ప క్యారెక్టర్ అసానియేషన్ చేయడం తగదన్నారు. మహిళా నాయకురాలి మీద అసభ్యకరంగా మాట్లాడుతూ, అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులు బండారు సత్యనారాయణను అరెస్ట్ చేయడాన్ని అందుకే తాను ఖండించలేదన్నారు. రాజకీయాల్లో ఉన్న మహిళల మీద, వారి వ్యక్తిగత జీవితాల మీద మాట్లాడే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించకూడదని, వాళ్ళకి శిక్ష పడాల్సిందే అన్నారు. ఈ విషయంలో చట్టరీత్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నామన్నారు.

రైతులకు చాప్ కట్టర్లు పంపిణీ చేస్తున్న ఎంపిపి రెడ్డెప్ప

పాడి రైతులకు చాప్ కట్టర్లు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని పాడి రైతులకు చాప్ కట్టర్ల ను ఎంపీపీ రెడ్డప్ప పంపిణీ చేశారు. రెండు నెలల క్రితం రైతులు ఆర్బీకెల ద్వారా సబ్సిడీ చాప్ కట్టర్ల కు 31 మంది రైతులు,పెద్దపంజాణి 1,చలమంగళం 4,నిడిగుంట 3, అప్పనపల్లి 2, తుర్లపల్లి 2, రాయలపేట 2 కొళత్తూరు 4, నాగిరెడ్డిపల్లి 3,పెద్దకా ప్పల్లి 4,,వీరప్పల్లి 2, కమ్మపాళ్యం 2 దరఖాస్తు చేసుకున్నారని వెటర్నరీ డాక్టర్ వినీత కుమారి అన్నారు. ఒక చాప్ కట్టర్ విలువ రూ.33984, సబ్సిడీ రూ.13002, మిగిలిన మొత్తం రూపాయలు 20,382 రైతు కట్టవలసి ఉంటుందని డాక్టర్ సరిత అన్నారు. మండల కేంద్రంలోని వెటర్నటి ప్రభుత్వ ఆసుపత్రిలో సబ్సిడీ చాప్ కట్టర్లను ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో మండల కన్వీనర్ బాగా రెడ్డి,జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడి రవికుమార్, లబ్ధిదారులు గోపాలమిత్రాలు పాల్గొన్నారు.

వైసిపి సీనియర్ నాయకులు ఎల్ రాజారెడ్డికి నివాళులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం కామిరెడ్డి వారి పల్లి మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటీసీ లక్కసాని రాజారెడ్డి(82) అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలరు. సీనియర్ నాయకులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరులుగా ఉంటూ సామ్యుడిగా పేరుపొంది, ఒకసారి సర్పంచి, రెండుసార్లు ఎంపిటీసీగా గెలుపొంది ప్రజలకు సేవ చేసిన ఈయన మృతి మండలంలో తీరని లోటని పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు అన్నారు. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి వద్ద రాజారెడ్డి భౌతికకాయాన్ని మంత్రి పెద్దిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప కామిరెడ్డి వారి పల్లెలో రాజారెడ్డి ఇంటి వద్ద ఆయన భౌతికకాయాన్ని కి పూలమాల వేసి అంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీ కామధేను రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం లిమిటెడ్ ప్రెసిడెంట్గా బాధ్యతలు నిర్వర్తిస్తూ అకాల మరణం చెందడంతో సీఈవో ఎస్ ఆర్ బాబు పాలకమండలి సభ్యులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పిటిసి కుసుమ మోహన్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కందూరు సర్పంచి భాష మసూద్, వైసీపీ నాయకులు బాలు, పలువురు వైసిపి నాయకులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జగనన్న ఆరోగ్యశ్రీలో 360 మందికి వైద్య చికిత్సలు

ప్రజాశక్తి -పాలసముద్రం: పాలసముద్రం మండలం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా పాలసముద్రం మండలంలో శ్రీకావేరిరాజపురం పంచాయతీలో సర్పంచ్ గాలి మహేష్, ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపు బుధవారం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో పలు రకాల వ్యాధికి చెందిన వైద్యులు వచ్చారు. దాదాపు 360 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బాబు, ఎంపీడీవో ప్రేమ్ రాజ్ కుమార్ , మండల అధ్యక్షుడు తులసి యాదవ్, జడ్పిటిసి అన్బుగలన్, వైకాపా మార్జి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు మోహన్ కృష్ణ, వాసంతి, కమిటీ హెల్త్ ఆఫీసర్ జ్ఞాన శేఖర్ , సూపర్వైజర్ మురళి కృష్ణ, ఎమ్మెల్ హెచ్పి నిర్మల , ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు,అంగన్వాడి వర్కర్లు, వాలంటీర్స్ పాల్గొన్నారు.

కాలేజీ రోడ్డులో చోరీ జరిగిన ఇళ్ల వద్ద గుమికూడిన జనం

సదుం లో వరుస చోరీలు
స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సదుం నందు మంగళవారం అర్ధరాత్రి వరుస చోరీలు జరిగాయి. కాలేజ్ రోడ్ లో నాలుగు ఇళ్లలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ చేశారు. ఆంజనేయులు అనే వ్యక్తి తన మామ కు ఆరోగ్యం బాగాలేక మదనపల్లెకు వెళ్ళాడు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తీసి వుండటం గమనించిన ఇరుగుపొరుగువారు ఆయనకు సమాచారం ఇచ్చారు. ఆకుల ధరణీ ఇంటికి తాళం వేసుకుని బంధువుల ఇంటికి వెళ్ళి ఉదయం వచ్చి చూడగా తాళం పగుల గొట్టి వుంది. ఇరువురూ సదుం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ ఐ మారుతి తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిత్తూరు క్లూస్ టీమ్ కు సమాచారం అందించడంతో వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఆంజనేయులు ఇంటిలో 29గ్రాముల బంగారు నగలు, 80వేలు నగదు పొయినట్లు పిర్యాదు చేయగా, ధరణీ ఇంటిలో 10 గ్రాముల బంగారం, వెండి గొలుసు చోరీ అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పై రెండు సంఘటనలతో పాటు వీ ఆర్ వో ల గది తాళాలు పగుల గొట్టి గది లోపల వస్తువులన్నీ చిందర వందర చేసినట్లు సమాచారం. అదేవిధంగా మరో రెండు ఇళ్ళలో దొంగలు తిరిగినట్లు ప్రచారం జరుగుతున్నా దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిసింది.

భూ సమస్యల పరిష్కారం కోసం
రైతులు తరలిరండి..

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు తరలిరావాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు శంకర్ పిలుపునిచ్చారు. ఈనెల 6వ తేదీ శుక్రవారం యాదమరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని భూ సమస్యలు కలిగిన రైతులు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా రైతులు అనుభవించుకుంటున్న భూములకు ఇప్పటివరకు పట్టాలు నోచుకోని రైతులు కు ప్రభుత్వం అమలు చేస్తున్న అసైన్మెంట్ కమిటీ నందు అర్హులైన రైతుల నమోదు చేసి వారికి పట్టా పుస్తకాలు వచ్చేందుకు అవకాశం ఉన్నందున ప్రతి రైతు తప్పక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీ సర్వేలు తప్పులు తడకలుగా పట్టాదారుపస్ పుస్తకంలో నమోదైన ప్రతి రైతు తమ సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు ఇదో మంచి అవకాశం. మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోని ప్రతి ఒక్క రైతు పాల్గొనాలని కోరారు. రైతులకు అండగా జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ని కలిసి ప్రతి రైతు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, మండల స్థాయి అధికారులు రైతుల సమస్యల పరిష్కరించడంలో ఉదాసీనంగా వ్యవహరించడం బాధాకరం అన్నారు. రైతు సమస్యను జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రతి రైతు పాల్గొనాలని కోరారు.

మహిళలు శారీరక మానసిక స్థైర్యం కలిగి ఉండాలి

ప్రజాశక్తి -కార్వేటినగరం : సమాజంలోని బాలికలు, మహిళలపై గౌరవం కలిగి ఉండాలని వెదురుకుప్పం వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అన్నపూర్ణ శారద తెలిపారు. బుధవారం కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సి.ఎన్.లత ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విజయులు రెడ్డి అధ్యక్షతన బాలికల గౌరవ పరిరక్షణ, వారిపై జరిగే సాంఘిక దురాచారాల నిర్మూలన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బి. అన్నపూర్ణ శారద మాట్లాడుతూ గతంలో స్త్రీ, పురుషులు ఆహారాన్వేషణలో సరి సమానమైన పాత్రను పోషించే వారని, తదనంతరం కాలగమనంలో స్త్రీలు ఇంటికి పరిమితమవడంతో పురుషాధిక్యత ఎక్కువైందని తెలిపారు. సమాజంలో నైతిక విలువలు కలిగి మహిళలు, విద్యార్థినుల పట్ల గౌరవప్రదంగాపాలు పంచుకోవాలని తెలిపారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తమ చుట్టూ గుర్తు తెలియని వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి గురించి వెంటనే తల్లిదండ్రు లకు, కళాశాల అధ్యాపకులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం అధ్యాపక బృందం ప్రిన్సిపాల్ అన్నపూర్ణ శారదా ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లావణ్య, భార్గవి, కళాశాల సిబ్బంది అశ్విని, తేజోవతి, అరుణ, జోగి ప్రసాద్, జేకేసి మెంటర్ లోకేశ్వర్, విద్యార్థినులు పాల్గొన్నారు.


డాక్టర్ సిఎన్ లతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

అభివృద్ధిపనులే సమాధానం చెబుతాయి..

షాపింగ్ కాంప్లెక్స్ భూమిపూజ లో మంత్రి రోజా

ప్రజాశక్తి-నగరి : బస్టాండు ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్కు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 16 ఏళ్లక్రితం రోడ్ల వెడల్పులో భాగంగా బస్టాండు ప్రాంగణంలోని మునిసిపల్ కాంప్లెక్స్ తొలగించారన్నారు. అప్పటి నుంచి నూతన కాంప్లెక్స్ నిర్మాణం అందని ద్రాక్షగానే మారిందన్నారు. పట్టువదలకుండా చేసిన ప్రయత్నాలతో నేడు కాంప్లెక్స్ నిర్మాణం సాధ్యమైందన్నారు. 897.67 చదరపు అడుగుల విస్తీర్ణంలో గుడ్విల్ బేసిస్లో రూ. 2.30 కోట్ల వ్యయంతో డెరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ గుంటూరు, ఇంజనీర్ ఇన్ చీఫ్ పబ్లిక్ హెల్త్ తాడేపల్లి వారు ఆమోదించిన నమూనాతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించను న్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్లో 31 గదులు, ఫస్ట్ ఫ్లోర్లో 31 గదులు, సెకండ్ ఫ్లోర్లో మీటింగ్ హాలు, ఆఫీసులకు 3 గదులు అంటూ మంజూరైన నమూనాలో తొలివిడతగా 31 గదులు నిర్మించనున్నామన్నారు. వీటికి సంబంధిత వేలంపాట ముగిసి నిబంధనల మేరకు షాపులను కూడా కేటాయించామన్నారు. ఎన్నికలలోపు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నగరిలో అభివృద్ధి జరగలేదని చెప్పే వారికి మా అభివృద్ధిపనులే సమాధానం చెబుతాయని మంత్రి ఆర్కేరోజా అన్నారు. రూ. 5.4 కోట్ల వ్యయంతో ఏరియా ఆస్పత్రి నవీకరించడంతో పాటు నగరి, పుత్తూరులో నాలుగు అర్బన్ హెల్త్సెంటర్లు నిర్మించామన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు నవీకరించామన్నారు. పార్కులు, కళ్యాణమండపాలు, షాదీమ హాల్లు, ఆలయాలు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఆర్బీకేలు, సచివాలయాలు, సమావేశ మందిరాలు, విలేజ్ క్లీనిక్లు నిర్మించా మన్నారు. సంక్షేమం ప్రతి ఇంటి తలుపు తడుతోందన్నారు. మనసున్న నాయకుడు కనుకే ఎన్నడూ లేనివిధంగా జగనన్న పాలనలో ఇంతటి అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు రామ్ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, పార్టీ అధ్యక్షులు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రోజా

అభివృద్ధిపనులే సమాధానం చెబుతాయి..

20న ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 80 వార్షికోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఈనెల 20వ తేదీన విజయవాడలోని రాజధాని లో ఉద్యోగులు ఎస్సీ సంక్షేమ సంఘం 80 వ వసంతాల విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రతన ప్రదీప్ తెలిపారు. బుధవారం సాయంత్రం చిత్తూరు నగరంలోని ఎన్జీవో హోమ్ లో జిల్లా నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.వి రాఘవులు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రత్న ప్రదీప్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన విజయవాడలో జరిగే విజయోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి అమలు జరిగేలా ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగేలా సంఘ సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధి తో పనిచేసే ఎస్సీ ల అభివృద్ధికి సంక్షేమానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సాజన్, దొరై కన్నన్, శివరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్సి ఉద్యోగుల సంఘం నాయకులు

డీకేటి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న సర్పంచ్ అనుచరులు ?

- చర్యలు తీసుకుంటామన్న ఆర్డిఓ - బాధితుడి వెల్లడి

ప్రజాశక్తి -పలమనేరు: నియోజకవర్గం లోని పెద్దపంజాణి మండలం లో రోజు రోజుకు భూ సమస్యల పర్వం కొనసాగుతోంది. ఇదే విషయంలో భాగంగా పెద్దపంజాణి రెవిన్యూ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 230/2 లో గల 3-10 ఎకరాలు భూమి ఫకీర్ భాషా సాహెబ్ పేరుపై ఉన్నట్లు ఇదే భూమిలో వ్యవసాయం చేస్తూ ఉన్న భూమిని చలమంగళం సర్పంచ్ అనుచరులు లతీఫ్, డి యం బావ జాన్ లు అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని 2017 లో ఆక్రమించుకొని డీకే టీ గా ఉన్న భూమిని సైతం రిజిస్ట్రేషన్ చేసి విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు గ్రహించి తన కుమారుడు ఎస్ యం డి గౌస్ బుధవారం స్థానిక ఆర్డిఓ శివయ్యను ఆశ్రయించారని ఓ బాధితుడు తెలిపాడు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జరిగిన విషయాన్ని ఆర్డివోకు వివరించగా తక్షణమే చర్యలు తీసుకోవాలని పెద్దపంజాణి మండలం తహశీల్దార్కు తెలిపారన్నారు. ఇదే క్రమంలో చట్టంలో లేని విధంగా డీకేటిని సైతం రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేస్తామని ఆర్డిఓ చెప్పినట్లు మీడియా సమావేశంలో గౌస్ తెలిపారు. ఇదే విషయమై ఆర్డీవో మాట్లాడుతూ అవకతవకలు ఎక్కడైనా నిర్వహిస్తే వారిపై వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారన్నారు. డీకేడీని రిజిస్ట్రేషన్ చేయడం విషయం అవాకైనా ఆర్డీవో వెంటనే రద్దు పరచాలని తహశీల్దారుకు ఆదేశాలు పంపినట్లు తెలిపారు. ఇలాంటి ఆగడాలపై భవిష్యత్ ప్రణాళిక రూపుదిద్దుకుని తాము ముందుకు వెళ్తున్నట్లు మీడియా సమావేశంలో తెలిపారు. ఇలాంటి విషయంపై పెద్దపంజాణి అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సి వుంది.

జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థికి ప్రశంస

ప్రజాశక్తి-నగరి : ఆంధ్రప్రదేశ్ బాల్బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు నిర్వహించిన అంతరాష్ట్ర బాల్బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి పోటీలకు ఎంపికైన వశిష్ట విద్యాలయ 10వ తరగతి విద్యార్థి తేజేష్ ను పాఠశాల కరస్పాండెంట్ రాజరాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు జయచంద్ర బుధవారం అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలంటూ ఆకాంక్షించారు. పీఈటీ సతీష్ మాట్లాడుతూ తేజేష్ బాల్బ్యాడ్మిం టన్లో రెండవ సారి చిత్తూరు జిల్లా నుంచి ఎంపికయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు గీత, విజయ పాల్గొన్నారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -చౌడేపల్లి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు బుధవారం స్థానిక తపాలా కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పుంగనూరు బ్రాంచ్ అధ్యక్షుడు కే కృష్ణమూర్తి ప్రసంగిస్తూ కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగును కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు పరచాలన్నారు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడచి పెట్టాలన్నారు. ఎనిమిది గంటల పని, పెన్షన్ తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని గ్రాడ్యుటీ రూ. 5 లక్షలకు పెంచాలని తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి , సుబ్రమణ్యం, ముద్దప్ప, విజయ్, అయ్యాక నరసింహులు, సుమలత, జనార్ధన, నాగరాజా , నందగోపాల్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

వీధి బాలలపై సర్వే

ప్రజాశక్తి- పలమనేరు : జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం రాస్, ఐసిడియస్ ,మండల విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం పలమనేరు పట్టణంలోని బస్టాండు, గంగమ్మ గుడి వీధి, ఏంబిటి రోడ్డు పరిసర ప్రాంతాలలో వీధి బాలులను సర్వే చేశారు. ఈ సర్వేలో వినాయకం, లక్ష్మి , అంజలిని వీధి పిల్లలుగా గుర్తించి అంజలిని చౌడేపల్లె మండలంలోని గర్ల్స్ హాస్టల్ లో 3 వ తరగతిలో, లక్ష్మిని గంగవరం మండలంలోని ఎంపీపీ ఎస్ బొమ్మనపల్లె పాఠశాలలో 4 వ తరగతి లో చేర్పించామని మండల విద్యాశాఖ అధికారి లీలారాణి తెలిపారు. ఈ సర్వేలో పట్టణంలోని అన్ని రంగాల షాపుల యాజమానులకు 14 సంవత్సరాల లోపల బడిఈడు పిల్లలను పనులలోకి చేర్పించుకున్న కుంటే 50 వేలు జరిమాన విధిస్తామని హెచ్చరించారు . ఈ సర్వేలో విద్యాశాఖాధికారులు, ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ మహిళా పోలీసులు, చైల్డ్ ప్రొడక్ట్ ఆఫీసరు, సి ఆర్ పి లు పాల్గొన్నారు.

వైసిపీ నాయకుల సమావేశం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గ వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు సియం కావాలంటే" అనే కార్యక్రమం నిర్వహనపై వైసిపీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఎమ్మెల్యే ఎన్. వెంకటేగౌడ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించడంపై పలు సూచన లు, సలహాలు అందజేశారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ మరలా వైసిపీ జెండా ఎగుర వేసేందుకు గెలుపే ధ్యేయం గా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ వైసిపీ నాయకులు, మండల కన్వీనర్లు, పంచాయతీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జయమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బండి జయమ్మకు నివాళులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని చవట గుంట గ్రామం లో జయమ్మ మంగళవారం మృతి చెందింది. విషయం తెలు సుకున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గ నాయకులు రాజేష్ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు . కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఆయన వెంట వైసీపీ నేతలు బండి గోవర్ధన్ రెడ్డి, పేట ధనుంజయ రెడ్డి, వైసీపీ నాయకులు ఉన్నారు.

'ఇంటింటికి టిడిపి'లో మాజీ మంత్రి అమర్

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలం గండ్రాజు పల్లి పంచాయతీ పరిధిలో గండ్రాజు పల్లి, ఆల కుప్పం, బసవరాజు పురం, జంగాలపల్లి, బండిళ్ళు, అనంతపురం, ఉగిని గ్రామాలలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అమరనాథరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమ ఉద్దేశ్యాన్ని ప్రజలకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాలలో ఆయనకు ప్రజలు ఘన స్వాగతం తెలిపారు. అడుగడుగునా నీరాజనాలు పడుతూ పూల వర్షం కురిపిస్తూ గజపూల మాలలతో ఆయనకు స్వాగతం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి ఇంటికి వెళ్లి టిడిపి ఆధ్వర్యంలో చేపట్టే మినీ మేనిఫెస్టోను వివరించడంతో పాటు వైసిపి అరాచక పాలనపై ఆయన అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, రాజన్న, బత్తి గౌడు, వెంకటేష్ నాయుడు, రాజేంద్ర, సుబ్రహ్మణ్యం, పలమనేరు పట్టణ అధ్యక్షులు కుట్టీ, వీ కోట మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్,పెద్దపంజాణి మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల దీక్ష

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఆంధ్రప్రదేశ్ సంక్షేమ ప్రదాత చంద్రబాబు నాయుడు కు జైల అని మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు అన్నారు బుధ వారం మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయం నిరాహార దీక్ష కార్యక్రమం ప్రధాన కార్యదర్శి జనార్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 9 సంవత్సరాల విభజన ఆంధ్ర ప్రదేశ్లో ఐదు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ ను అన్ని విధాల అభివృద్ధి చేపట్టారని అందుకు సాక్ష్యాలు చాలా ఉన్నాయని సిఐడి చేపడుతున్న అక్రమ అరెస్టు పై ఆధారాలు లేవని నిరాధాలతో అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, సర్పంచులు కొక ప్రకాష్ నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి నాయకులు, కవి రాజేంద్ర నాయుడు, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు వైఎస్ఆర్టీఎఫ్ ఆధ్వర్యంలో
అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి -పలమనేరు: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవమును పురస్కరించుకొని వైయస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా గౌరవ సలహాదారు ఎన్. సోమచంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలు ఎం.పుష్పావతి లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ వాసు ఏశ్రీనివాసులు, ఎమ్మెల్యే వేంకటేగౌడ, డీఈఓ విజయేంద్ర రావు హాజరుతున్నారన్నారు. పలమనేరు డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు, ఏంటిఎస్ ఉపాధ్యాయులు అందరూ తప్పక హాజరుకావాలని ఈ సందర్భంగా వారు పిలుపు నిచ్చారు.

మంత్రి రోజాను ప్రజలు నమ్మరు: టిడిపి

ప్రజాశక్తి-నగరి: మంత్రి రోజా బూతులకు కేరాఫ్ అడ్రస్ అని, అమాయకపు నటనను ప్రజలు నమ్మరని, ఉన్న కొద్ది కాలం ప్రజాసేవ చేస్తే మంచిదని టీడీపీ నగరి నియోజ కవర్గ ఇంచార్జి గాలి భాను ప్రకాష్ తెలిపారు. బుధవారం తగిలి మున్సిపాలిటీ ఆర్ డి ఓ ఆఫీస్ ఎదురుగా నగరి పట్టణంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు అక్రమ అరెస్టుకు నిరసనగా కొనసాగుతున్న నిరాహార దీక్షలో నగరి టిడిపి ఇన్చార్జ్ గాలి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు అర్ధ నగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును మరింత ప్రజల్లోకి తీసుకెళ్ళి వివరిస్తామని రాష్ట్ర ప్రభావశీలుల కమిటీ మెంబర్ భీమనేని చిట్టిబాబు నాయుడు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 23వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరం కొనసాగింది. బుధవారం ఈ సందర్భంగా పలువురు కళాకారులచే దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్, చెంగల్రాయ్ యాదవ్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

డివైడరును ఢీకొన్న కారు..
షాక్తో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలంలోని చెన్నై -బెంగళూరు రహదారిలో బుధవారం కారు అదుపు తప్పి డివైడర్ ను ఢీకొనడంతో షాక్కు గురైన వృద్ధురాలు మృతి చెందింది. ఎస్ఐ ప్రతాప్ రెడ్డి కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన గిర్వోమ్ (77), తన భార్య జామినా(72), కొడుకు కోడలు 'నలుగురు కలిసి కారులో చెన్నై నుంచి బెంగళూరుకు బయలు దేరారు. పలమనేరు- బెంగళూరు జాతీయ రహదారిలోని మామడుగు క్రాస్ వద్ద కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడరును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వృద్ధురాలు జామినా షాక్కు గురైంది. దీంతో ఆమెకు పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను మోసం చేస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలి

- జిల్లా రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శి హరి శంకరన్

ప్రజాశక్తి- యాదమరి: రైతులను మోసం చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టాలని రైతు సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరి శంకరన్ అన్నారు. బుధవారం యాదమరి మండలంలో రైతులకు జరుగుతున్న అన్యాయంపై స్పందించి ప్రతి వ్యక్తికి మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో ఎక్కువ పని ఉంటుందని పనులు చేపట్టాల్సిన మండల మెజిస్ట్రేట్ నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించడం వల్ల పనులు మొత్తం ఆగిపోతున్నాయని ఇకనైనా మండల మెజిస్ట్రే పై జిల్లా అధికారులు చర్యలు చేపట్టి ఆయన నిర్లక్ష్య ధోరణి మాన్పించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు.

జగనన్న కంటి వెలుగు అద్దాలు అందిస్తున్న వైసిపి నాయకులు

జగనన్న కంటి వెలుగు పలువురికి ఉపయోగం

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగిలేశ్వర

ప్రజాశక్తి - బంగారు పాళ్యం: జగనన్న కంటి వెలుగు కార్యక్రమంతో పలువురికి ఉపయోగమని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మొగలేశ్వర అన్నారు. బుధవారం మండలంలోని బోడబండ గ్రామంలో తుంబ కుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయల్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మోగిలేశ్వర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం చేపట్టేందుకు కోసం నైపుణ్య వంతులు గల వైద్యులను గ్రామాలకు పంపి గ్రామీణ ప్రాంత వాసులు మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల , ఎంపీటీసీ హరి, ఇంచార్జ్ ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ నాగేశ్వరరావు, ఇన్చార్జి ఓపి ఆర్ డి దుర్గాప్రసాద్, అంగన్వాడీ సూపరువైజర్ జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి మధు, నాయకులు చంద్రయ్య, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

జగనన్న సురక్షతోనే మెరుగైన వైద్యం

ప్రజాశక్తి -పుంగనూరు: పేదలకు మెరుగైన వైద్యం జగనన్న సురక్ష పథకం ద్వారానే అందిస్తామని పికెయం వుడ చైర్మన్ నల్లబాల వెంకట రెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ హలీం భాష లు అన్నారు. పట్టణంలోని తూర్పు మోసాలు టిటిడి కళ్యాణ మండపం వద్ద ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జానపద కళల అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం , మున్సిపల్ కమిషనర్ నరసింహా ప్రసాద్ ,వైస్ చైర్మన్ లు, కొండవీటి నాగేంద్ర,జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎండి రహంతుల్లా , డి సి హెచ్ ఎస్ రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్సరేష్మ మనోహర్ ,భారతి ,సాజిదా, కాళిదాస్ ,కిజర్ ఖాన్ ,వైసిపి టౌన్ ప్రెసిడెంట్, జయరాం పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురంలో

ఎస్ఆర్ పురం : పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ఎంపీడీవో కృష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిళ్లై అన్నారు. మండలంలోని నెలవాయి గ్రామ పంచాయతీ నెలవాయి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ను బుధవారం నెలవాయి గ్రామ సర్పంచ్ జయలక్ష్మి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మణీ, ఎస్ఆర్ పురం వైద్యాధికారి డాక్టర్ పల్లవి , గ్రామ సెక్రెటరీ నంద కుమార్ , నాయకులు జనార్ధన్ భూపతిరెడ్డి కార్యకర్తలు ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. బుధవారం మండలంలోని అప్పినపల్లి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు మురళీకృష్ణ,మురళి, వైద్య సిబ్బంది స్థానిక నాయకులు రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, చాలా సిబ్బంది గ్రామ పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

కార్వేటినగరం : రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతి పేదవారికి ఉచితంగా వైద్యం అందించేలానే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభిచండం జరిగిందని ఎంపీపీ లతబాలాజీ అన్నారు.బుధవారం ఆలత్తురు గ్రామ పంచాయతీ వద్ద ఈ కార్యక్రమన్ని ఎంపీపీ ప్రారంబించారు. రోగులకు కంటి అద్దాలు, కే షిట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి ,ఈ కార్యక్రమంలో వైద్యధికారులు డాక్టర్ యూసఫ్, భువనేశ్వరి, పాండియన్,దివ్య తేజ,సర్పంచ్ పుష్పాంజలి,డిటి లక్ష్మీపతి, బిల్ కలెక్టర్ హరికృష్ణ,కార్యదర్శి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీ శీలం వారి పల్లె వద్ద బుధవారం జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని మండల స్థాయి అధికారులు వైద్య బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో దాదాపు 200 మంది పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 35 మందిని మరింత నాణ్యమైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 42 మందికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి త్వరలో కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జయసింహ, విజయలక్ష్మి, గ్రీష్మ బిందు కంటి వైద్యులు, సాయి వెంకట్ జనరల్ వైద్యులు, ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, పలువురు వైసిపి నాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.